# ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## నా కథ

# యద్దనపూడి సులోచనారాణి

( సినిమారంగం - 1972, సెప్టెంబర్ సంచిక నుంచీ)

నా కథ...

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి



[మాటలలో మాధుర్యాన్ని, పాత్రలలో నిర్మల తత్వాన్ని చాటే విఖ్యాత రచయిత్రి శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి శ్రీ నెమలికంటి చలపతిరావు గారి కుమార్తె. శ్రీ యద్దనపూడి లక్ష్మీ నరసింహారావుగారి అర్ధాంగి. ఆదిలో అన్న శ్రీ ఎన్. రాధాకృష్ణమూర్తి ఎన్నో కథలు రాసేవారు. ఆ కథలను ఈమె ఫేర్ చేసేది చిన్నతనంలో.

శరత్ సాహిత్యాన్ని ఆరాధించే ఈమె చదివింది స్కూల్ ఫైనల్ వరకే అయినా ఇంగ్లీషు గ్రంథాలు చాలా చదివింది. మానవత పైన, మానవ శక్తి పైన ఈమెకు అత్యంతమైన విశ్వాసం ఉంది. కళాత్మక హృదయం గల ఈమె ఇంత వరకూ తనకు నచ్చిన రచన వెలువడలేదంటూంది. ఈమెకు రచనా వ్యాసంగంలో ఒక ఆశయం ఉంది. అది ప్రపంచంలో సాధ్యమైనన్ని భాషలలో తెలుగు రచనలు స్వీయ రచనలయితే మరీ మంచిది అనువదించబడేట్టు చూడాలని. సినిమాలకు మాటలు రాయటం పట్ల అంత ఆసక్తి లేకపోయినా ఈ పరిశ్రమలో గడిస్తున్న అనుభవం దృష్ట్యా స్క్రీన్ ప్లే తనే రాసి ఒక చక్కని స్వీయ నవలని ఒక సమర్ధవంతుని దర్శకత్వంలో నిర్మించాలన్న ఆకాంక్ష ఈమెకు ఉంది.]

కృష్ణా జిల్లాలో బందరు దగ్గర కాజ లో సనాతన ఆచారాలు గల పెద్ద కుటుంబంలో 1939 ఏప్రిల్ 2న జన్మించాను. అయిదుగురు అక్కలు, ముగ్గురు అన్నలు ఉన్నారు. నా తల్లిదండ్రులకు ఆఖరి సంతానాన్ని అవడం వల్ల కొంచెం గారాబంగానే పెరిగాను.

"చిత్రనళీయం" అనే నా మొట్ట మొదటి కథ 1957 "ఆంధ్ర పత్రిక"లో ప్రచురించబడింది. నేను చాలా తక్కువగా వ్రాసేదాన్ని. వ్రాసినవి "ఆంధ్ర పత్రిక"కే పంపించేదాన్ని. నేను కథ పంపడమే ఆలస్యమన్నట్లు "ఆంధ్ర పత్రిక" సంపాదకులు రెండు మూడు వారాలు ముందుగానే పెద్ద పెద్ద అక్షరాలతో, నా కథ ఫలానా వారం రాబోతూన్నట్లు పబ్లిసిటీ ఇచ్చేవాళ్ళు. ఆ పెద్ద పెద్ద అక్షరాలలో నా పేరు చూసుకోవడం అప్పట్లో నాకు చాలా త్రిల్లింగ్ గా ఉండేది. నా కథలు అప్పట్లో పాపులర్ అవటానికి సగం కారణం బాపూ వేసిన బొమ్మలేనని నేను అనుకుంటాను. చాలా అందంగా, నా కథలో ఉన్న భావం అంతా ఆ బొమ్మల్లో ప్రతిబింబిస్తున్నట్టుగా ఉండేవి.

1957 నించి 1962 వరకు నేను వ్రాసిన కథలు దాదాపు పది కూడా లేవు. ఆ టైమ్ లో నేను అత్తవారింటికి రావటం, కొత్త పరిసరాల మధ్య మెలగటం వల్ల బహుశా నేను ఎక్కువగా వ్రాయలేక పోవటానికి కారణం అనుకుంటాను. దాదాపు నేను పూర్తిగా వ్రాయటం మానేసేదాన్ని. కీ||శే|| గోపీచంద్ గారు "యువ"కు తరుచుగా వ్రాస్తూండమని ప్రోత్సహిస్తూ ఉండేవారు.

1962లో "చదువుకున్న అమ్మాయిలు" సినిమా కథగా వ్రాస్తున్న డాక్టర్ శ్రీదేవి మరణించడం, ఆ కథ 'చదువుకున్న ఆడపిల్లల కథ' కావడంతో ఆమె సగం వ్రాసి వదిలేసిన కథను పూర్తి చేయటానికి అన్నపూర్ణా వారు కొత్త లేడీరైటర్స్ కోసం గాలిస్తున్నప్పుడు శ్రీ దాశరథి నా పేరు సూచించటం జరక్కపోతే నా సినిమా కథల విషయం ఎలా ఉండేదో నాకు తెలియదు.

మొదట్లో సినిమా కథ అంటే చాలా హుషారు పడ్డాను. కాని, తర్వాత తర్వాత శ్రీ దుక్కిపాటి మధుసూదన రావు గారి డిసిప్లిన్, అన్న టైమ్ ప్రకారం స్క్రిప్ట్ ఇచ్చేయాల్సిన ఖచ్చితమైన పద్ధతి నాకు కొంచెం ఇబ్బంది అనిపించేది. ఎప్పుడో సరదాగా బుద్ధి పుట్టినప్పుడు ఏదో ఒక కథ వ్రాసి, దాన్ని మళ్ళీ కాపీ కూడా చేయకుండా పత్రికకి పంపే అలవాటయిన నాకు వ్రాసింది ఒకటికి పది సార్లు చదువుకోవటం, ఎదుట వాళ్ళకు ఏ అనుమానాలు వస్తాయో అని నాలో నేనే ఆలోచించుకోవటం, వ్రాసిన దాన్నే తిరిగి మళ్ళీ మళ్ళీ వ్రాయటం చాలా బోర్ గా అనిపించేది. ఇక జన్మలో సినిమా కథ వ్రాయకూడదు అనుకున్నాను. (కాని ఇప్పుడు సినిమా కథే తేలిక అనిపిస్తోంది. ఎందుకంటే, సినిమా కథ తయారు చేయటంలో మనకు తోడుగా డైరెక్టర్, ప్రొడ్యూసర్, డైలాగ్ రైటరూ ఉంటారు. ఈ ప్రశ్నలు వేసుకుని జవాబులు చెప్పుకునే భారం సగం వాళ్ళు భరిస్తారు.)

ఇంచుమించుగా అదే టైమ్ లో శ్రీ రమణ, శ్రీ బాపూ "జ్యోతి" పత్రికకు నన్ను ఒక సీరియల్ వ్రాసి ఇమ్మని కోరటం జరిగింది. నేను చిన్న చిన్న కథలే తప్ప సీరియల్స్ వ్రాయలేనని చెప్పాను. పోనీ, కాస్త పెద్ద కథ వ్రాసి ఇవ్వండి_అంటూ వాళ్ళు ప్రోత్సహించారు. ఆ పెద్ద కథే నా మొట్ట మొదటి నవల "సెక్రెటరీ". తర్వాత సీరియల్స్ నాకు అలవాటు అయిపోయినాయి.

ఆ విధంగా ఇటు సినిమాలకు వ్రాయటం, అట పత్రికలకు సీరియల్స్ వ్రాయటం ఒకేసారి మొదలైంది.

ఒక సబ్జెక్ట్ మీద ఏకాగ్రత కుదుర్చుకోవటంలో శ్రీ మధుసూదనరావుగారి దగ్గర అభ్యాసం అయిన డిసిప్లిన్ కానివ్వండి, ఇటు సీరియల్స్ వ్రాయాల్సిన వత్తిడి వల్ల కానివ్వండి ఒకేరోజున రెండు మూడు వివిధ కథలను వ్రాయటం నాకు ఇప్పుడు బాగా అలవాటు అయింది. ఇది కేవలం అభ్యాసం వల్ల వచ్చిన విషయం.

నేను వ్రాసినవి ఇప్పటి వరకూ ఒక పదిహేను కథలు, ఏడు నవలలు కంటే ఎక్కువ లేవు.

సినిమా కథలకు శ్రీ మధుసూదన రావు గారు, సీరియల్స్ కు రమణ బాపుగార్లు పునాదులు వేసుకోటానికి నాకు ఒక విధంగా సాయపడ్డారు. ఈ పునాదుల మీద ఎంత అందమైన, పటిష్టమైన సాహితీ భవనం నేను కట్టుకోగలను అనేది కేవలం నా సామర్థ్యం మీద, నా కృషి మీద ఆధారపడి ఉంటుందని నాకు తెలుసు.

నా నవలలు : సెక్రెటరీ, విజేత, ఆహుతి, జీవన తరంగాలు, మీనా, ఆరాధన, ఆశల శిఖరాలు.

ఇంతవరకు వచ్చిన సినిమాలు : మనుషులు మమతలు, ఆత్మ గౌరవం, ఆత్మీయులు, జై జవాన్.

చిత్ర నిర్మాణంలో ఉన్న నా నవలలు : విచిత్ర బంధం, జీవన తరంగాలు, మీనా (సారథి స్టూడియోస్), ఆరాధన (హిందీ, శ్రీ ఎల్.వి. ప్రసాద్ గారి ప్రసాద్ ప్రొడక్షన్స్).

★★★

COMMENTS